సాక్షి
కామారెడ్డి
శనివారం । 11 । ఫిబ్రవరి । 2023



బీజేపీతో సాధ్యం

అవినీతి రహిత పాలన బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం కార్నర్ మీటింగ్‌లు నిర్వహించారు.

- 9లో ▸



రోడ్డు వెడల్పు చేయొద్దు

భిక్కనూరు మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ పనులను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ బాధితులు రాస్తారోకో చేశారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
34.1 /11.5

వాతావరణం

పొగ మంచు కురుస్తుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. రాత్రి చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

నేడు జాతీయ లోక్ అదాలత్

కామారెడ్డి టౌన్: జిల్లా కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు కామారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అమృత్‌రావు వైద్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా జిల్లా కోర్టు న్యాయమూర్తి ఎస్ఎన్ శ్రీదేవి, జిల్లా అడిషనల్ న్యాయమూర్తి లాల్‌సింగ్ శ్రీనివాస్ నాయక్‌లతో పాటు కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందని తెలిపారు. జిల్లా కోర్టులోని కేసులకు సంబంధించి రాజీ కోసం ఈ జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కక్షిదారులకు సూచించారు.

5,321 మందికి కంటి పరీక్షలు

కామారెడ్డి టౌన్: జిల్లాలో కంటి వెలుగులో భాగంగా శుక్రవారం 5,321 మందికి కంటి పరీక్షలు చేసి, 677 మందికి కంటి అద్దాలను అందించారు. ఇప్పటివరకు 82,156 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని, 14,395 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశామని వైద్యాధికారులు తెలిపారు.

ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 112 మంది ఎంపిక



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల చరిత్రలోనే తొలిసారిగా ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 112 మంది విద్యార్థులు ఉద్యోగాలు పొందారని కళాశాల ప్రిన్సిపాల్ కిష్టయ్య తెలిపారు. శుక్రవారం కామారెడ్డి కళాశాలలో జెన్‌ప్యాక్ట్ సంస్థ ఆధ్వర్యంలో ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. 2022, 2023 సంవత్సరాలకు చెందిన 400 మంది డిగ్రీ విద్యార్థులు ఇందులో పాల్గొన్నారని, ఇందులో 112 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ తెలిపారు. ప్లేస్‌మెంట్ డ్రైవ్ విజయవంతం కావడంపై కళాశాల ఐక్యూఏసీ, టీఎస్‌కేసీ, టాస్క్‌ల సమన్వయ కర్తలు ఫర్హిన్ ఫాతిమ, రాజ్‌కుమార్, శ్రీనాథ్, లక్ష్మణ్, అజారుద్దీన్ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు నవాజ్, కోమల్, సువెష్ణ, వైస్ ప్రిన్సిపాల్ చంద్రకాంత్, అధ్యాపకులు శంకర్ పాల్గొన్నారు.

'ఈజీఎస్ ఉద్యోగులకూ పే స్కేల్ వర్తింపజేయాలి'




కామారెడ్డి రూరల్: ఉపాధి హామీ ఉద్యోగులకు పే స్కేల్ వర్తింపజేయాలని ఈజీఎస్ జేఏసీ జిల్లా చైర్మన్ కృష్ణాగౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఉపాధి హామీ ఉద్యోగులు కలెక్టర్ జితేష్ వి పాటిల్, డీఆర్‌డీవో సాయన్నను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధి శాఖలో ఐకేపీ, ఉపాధి హామీ పథకం రెండూ కీలకంగా పనిచేస్తాయన్నారు. కానీ సీఎం కేసీఆర్ ఐకేపీ ఉద్యోగులకు పే స్కేల్ ఇస్తామని అసెంబ్లీలో ప్రకటించారని, ఈజీఎస్ ఉద్యోగులకూ ఈ నిర్ణయాన్ని వర్తింపజేయాలని కోరారు. ఉపాధి కల్పించే సిబ్బందికే భద్రత లేకపోవడం బాధాకరమన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఈజీఎస్ జేఏసీ నాయకులు ధర్మారెడ్డి, హరికృష్ణ, సురేందర్, గంగాధర్, రాజు, జోషి, సాంబాజీ, హరిబాబు, సుదర్శన్, శేఖర్, గణేష్ ప్రసాద్, స్వాతి, క్రాంతి, వినోద్, రమేష్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సెస్సీ విద్యార్థులకు ప్రతిరోజూ స్నాక్స్

మోర్తాడ్/నిజామాబాద్‌అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల సమయంలో ఆకలి తీర్చేందుకు స్నాక్స్ అందించాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఇందులో భాగంగా సోమవారం నుంచి వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యే వరకు 34 రోజుల పాటు స్నాక్స్ ను అందించనున్నారు. ఒక్కో విద్యార్థికి రోజుకు అల్పాహారం కోసం రూ. 15 చొప్పున నిధులను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. జిల్లాలో 263 ఉన్నత పాఠశాలల్లో 9,711 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. వీరికి రోజుకు రూ. 1,45,665 నిధులు అవసరం కాగా 34 రోజుల పాటు అల్పాహారం కోసం రూ. 49,52,610 మొత్తాన్ని కేటాయించారు. ఆయా పాఠశాలల ఎస్ఎంసీ ఖాతాల్లో అల్పాహారం కోసం మంజూరు చేసిన నిధులను విద్యాశాఖ జమ చేసింది.

ఆ'ఖరీదు' మజిలీ!



పేదోడికి బతుకే కాదు.. చావు కూడా భారంగా మారింది. ఎవరైనా చనిపోతే పాడె కట్టడం నుంచి చితిని కాల్చేదాకా అవసరమైన అన్నింటి ధరలూ అడ్డగోలుగా పెరిగాయి. దీంతో చనిపోయిన వారిని తలచుకుని ఏడవాలో, అంత్యక్రియల తంతు పూర్తయ్యేందుకు డబ్బులు ఎలా సర్దుబాటు చేయాలో తెలియక పేద, మధ్య తరగతి జనం విలవిల్లాడుతున్నారు. అంతిమ యాత్రకూ అప్పులు చేయాల్సిన పరిస్థితిని తలచుకుని కుమిలిపోతున్నారు.

- పేదింట్లో 'అంత్య' వేదన
- అడ్డగోలుగా పెరిగిన అంతిమ సంస్కార ఖర్చులు
- ఇబ్బందిపడుతున్న పేద, మధ్య తరగతి జనం

సాక్షి, కామారెడ్డి: పట్టణాలతో పాటు పల్లెల్లోనూ చావు ఖర్చులు అడ్డగోలుగా పెరిగాయి. కామారెడ్డి లాంటి పట్టణాల్లో శవ దహనం సామాన్యుడికి భారంగా మారింది. పట్టణ ప్రజలు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చి స్థిరపడిన వారు వారి కుటుంబాల్లో ఎవరైనా చనిపోతే అంత్యక్రియలు జరపడానికి తలలు పట్టుకుంటున్నారు. జనాభా ఎక్కువగా ఉన్న కులాల వారు తమ పలుకుబడితో అంత్యక్రియల తంతు నిర్వహించడానికి అవసరమైన వృత్తుల వాళ్లు, పనివాళ్లను పిలిపించి ఎవరికి ఎంత ఇవ్వాలన్న దానిపై ఒప్పందాలు చేసుకున్నారు. అయినా అంత్యక్రియల రోజున అదనపు వసూళ్లు సాధారణం అయ్యాయి. కరోనాకు ముందు చావు ఖర్చు రూ.10 వేల నుంచి రూ.15 వేలలోపు అయ్యేది. ఇప్పుడు ఆ ఖర్చులన్నీ అడ్డగోలుగా పెరగడంతో రూ. 30 వేలపైనే ఖర్చవుతోంది.

పాడె కట్టెలు, కుండకు రూ. 1,500...

శవాన్ని సంప్రదాయబద్ధంగా శ్మశానానికి తీసుకువెళ్లడానికి పాడె తయారు చేస్తారు. దీనికి అవసరమైన కట్టెలు, కుండల కోసం తక్కువలో తక్కువ రూ.1,500 తీసుకుంటున్నారు. మృతదేహంపై కప్పడానికి వస్త్రాలు, చల్లడానికి అవసరమైన పువ్వులు, పేలాలు, కాల్చడానికి అవసరమైన నెయ్యి తదితర వస్తువుల మూట కోసం దాదాపు రూ.6 వేల నుంచి రూ.9 వేల దాకా ఖర్చవుతున్నాయి.

వైకుంఠ రథం, పువ్వులకూ ఖర్చు ఎక్కువే...

పట్టణ ప్రాంతాల్లో శ్మశాన వాటికలు దూరాన ఉండడం, దీనికి తోడు మృతదేహాన్ని మోయడానికి నేటి తరం ముందుకు రాని పరిస్థితుల్లో వైకుంఠ రథం అవసరం ఏర్పడింది. వైకుంఠ రథం నడవడానికి డీజిల్, వాషింగ్ ఖర్చుల కోసం అంటూ తక్కువలో తక్కువ రూ. 1,500 తీసుకుంటున్నారు. పూల డెకరేషన్ అంటూ రూ. రూ.2 వేల వరకు వసూలు చేస్తున్నారు.

పనోళ్ల ఖర్చు రూ. 10 వేలపైనే...

అంతిమ సంస్కారాల సమయంలో వివిధ వృత్తుల వారి అవసరం ఉంటుంది. పాడె కట్టడం నుంచి చితి పేర్చే వరకు.. కులవృత్తులవారే చేస్తారు. ఆయా పనులు చేసినందుకు వీరికి తక్కువలో తక్కువ రూ. పదివేల వరకు ఖర్చవుతోంది. అలాగే కాటి కాపరులు చితిపై పడుకుని తాము అడిగినంత ఇవ్వాలని పట్టుబడుతుంటారు. దీంతో వారు అడిగినంత ఇవ్వాల్సి వస్తోంది. తర్వాత దిన కర్మలకూ భారీగానే ఖర్చవుతోంది. ఇలా అన్ని రకాల ఖర్చులు కలిపి తడిసిమోపెడవుతున్నాయి. ఆర్థికంగా ఉన్న వారికి ఏ ఇబ్బందీ లేకపోయినా.. పేద, మధ్య తరగతివారు మాత్రం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చావు ఖర్చుల కోసమూ అప్పులు చేయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్పందించాల్సిన అవసరం ఉంది. అంతిమ సంస్కారాలకు సర్కారే ఏర్పాట్లు చేస్తే పేదలకు ప్రయోజనకరంగా ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కరీంనగర్ నగరంలో ఎవరైనా చనిపోతే అంత్యక్రియలకోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి ఉండదు. నగర పాలక సంస్థే అన్ని ఏర్పాట్లు చేస్తుండడం ఇందుకు కారణం. కరీంనగర్‌లో నగర పాలక సంస్థకు ఒక్క రూపాయి చెల్లిస్తే చాలు.. అంతిమ సంస్కారానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తారు. పేద, ధనిక తేడా లేకుండా అందరికీ ఇది వర్తిస్తుంది. ఈ పథకంతో నగరపాలక సంస్థ ప్రజల మన్ననలు అందుకుంది. అంతటా ఈ నిర్ణయాన్ని అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కలప ధర రెట్టింపు..

పల్లెల్లో కుల సంఘం వారు, ఇరుగు పొరుగువారు అడవికి వెళ్లి కలప నరికి తీసుకువచ్చి చితి పేర్చేందుకు ఆసరా అయ్యేవారు. ప్రస్తుతం ఈ సంస్కృతి కనుమరుగు అవుతోంది. చాలా గ్రామాల్లో శవ దహనాలకు కట్టెలు దొరకకపోవడంతో సామిల్లుల నుంచి కొనుగోలు చేసి తీసుకువెళ్తున్నారు.

సామిల్లుల యజమానులు చాలావరకు శవ దహనాలకు కలప అమ్మరు. ఏదో ఒక సామిల్‌లోనే విక్రయిస్తారు. దీంతో వారు చెప్పిన ధరకే కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉంది. శవ దహనానికి సుమారు ఐదారు క్వింటాళ్ల కలప అవసరం అవుతుంది. గతంలో క్వింటాలుకు రూ. 3 వందల నుంచి రూ. 4 వందల వరకు విక్రయించేవారు. ఇటీవలి కాలంలో ధర రెట్టింపయ్యింది. క్వింటాలుకు రూ. 7 వందలపైనే వసూలు చేస్తున్నారు. దహనానికి అవసరమైన కలప కొనుగోలుకే రూ. 4 వేలవరకు వెచ్చించాల్సి వస్తోంది. దానిని వైకుంఠధామం వరకు తరలించడానికి వాహన కిరాయి అదనం..

పోడు పట్టాలు దక్కేదెవరికో?

- గిరిజనులకు నెలాఖరులో పట్టాలిస్తామన్న సీఎం
- జిల్లాలో 11,282 దరఖాస్తులు..
- దరఖాస్తుదారుల్లో ఉత్కంఠ



సాక్షి, కామారెడ్డి: గిరిజన రైతులకు ఈనెలాఖరులో పోడు పట్టాలను పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో దరఖాస్తుదారుల్లో ఆశలు చిగురించాయి. అయితే ఎవరికి పట్టాలు దక్కుతాయో, ఎవరికి నిరాశ ఎదురవుతుందోనని ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.

పోడు భూముల సమస్యను పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం కొంతకాలంగా కసరత్తు చేస్తోంది. ఇప్పటికే పోడు సాగుదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించింది. గ్రామ, మండల, డివిజన్, జిల్లా స్థాయిలలో వాటిని పరిశీలిస్తున్నారు. అయితే గిరిజనులకు సంబంధించిన దరఖాస్తులను మాత్రమే ఈసారి పరిగణనలోకి తీసుకుంటున్నారు. దీంతో ఇతర కులాలకు చెందిన పోడు రైతులను పక్కనబెట్టినట్లేనని తెలుస్తోంది. గిరిజన రైతులకు ఈ నెలాఖరులో పోడు పట్టాలిస్తామని శుక్రవారం అసెంబ్లీలో సీఎం కేసీఆర్ ప్రకటించారు. పట్టాలివ్వడమే గాకుండా రైతుబంధు ఇస్తామని, ఇంకా అన్ని రకాలుగా సహకరిస్తామని ప్రకటించడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. అయితే ఇక ముందు అటవీ భూములను ఆక్రమించబోమని, అడవులను కాపాడుకుంటామని గ్రామ స్థాయిలో ప్రజాప్రతినిధులు, అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు, రైతులు భరోసా ఇవ్వాలన్న మెలిక పెట్టారు. అయినప్పటికీ పోడు పట్టాలిస్తే చాలని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. జిల్లాలో 11,282 మంది గిరిజనులు పోడు పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వారి దరఖాస్తులను వివిధ స్థాయిల్లో పరిశీలిస్తున్నారు. ఎన్నేళ్ల నుంచి సాగు చేస్తున్నారు? వారి కుటుంబానికి ఎంత భూమి ఉంది? కొత్తగా అడవులను నరికారా? అన్న విషయాలపై వివరాలు సేకరిస్తున్నారు. దీంతో ఎంతమందిని అనర్హులుగా తేలుస్తారన్న విషయమై ఉత్కంఠ నెలకొంది.

'ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి'

నిజాంసాగర్: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి ఎండగట్టాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార సూచించారు. శుక్రవారం మండలంలోని ఆరేడ్, అచ్చంపేట, గోర్గల్, మంగ్లూర్ గ్రామాల్లోని శక్తి కేంద్రాల్లో 'ప్రజా గోస – బీజేపీ భరోసా' కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె కార్యకర్తలతో మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని సూచించారు. సమావేశంలో నర్సాపూర్ నియోజకవర్గ బీజేపీ నేత మురళి యాదవ్, నిజాంసాగర్ మండల అధ్యక్షుడు సాయిలు, మండల మహిళా అధ్యక్షురాలు గోలి స్వరూప లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



మంగ్లూర్‌లో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార

'రిజర్వేషన్ సమస్య పరిష్కరించండి'



అసెంబ్లీ లాబీలో మంత్రి ప్రశాంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఖాయితీ లంబాడీలు

సాక్షి, కామారెడ్డి: దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న తమ రిజర్వేషన్ సమస్యను త్వరగా పరిష్కరించాలని ఖాయితీ లంబాడీలు కోరారు. గాంధారి మండలానికి చెందిన ఖాయితీ లంబాడీలు శుక్రవారం ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో మంత్రి ప్రశాంత్‌రెడ్డిని కలిశారు. ఈ విషయమై ఇప్పటికే అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించామని మంత్రి తెలిపారు. సీఎం కేసీఆర్ మరోసారి లేఖ రాయనున్నారన్నారు. దీంతో ఖాయితీ లంబాడీలు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

జియో ఇన్ఫర్మాటిక్స్ బీవోఎస్‌గా సుధాకర్‌గౌడ్

భిక్కనూరు: భిక్కనూరులోని తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్ జియోఇన్ఫర్మాటిక్స్ బోర్డు ఆఫ్ స్టడీస్(బీవోఎస్) చైర్మన్‌గా సుధాకర్‌గౌడ్‌ను వైస్ చాన్స్‌లర్ రవీందర్ గుప్తా నియమించారు. ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులు సుధాకర్‌గౌడ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ప్రతిజ్ఞ, నారాయణ, జియో ఇన్ఫర్మాటిక్స్ విద్యార్థులు పాల్గొన్నారు.



సుధాకర్‌గౌడ్‌ను సన్మానిస్తున్న విద్యార్థులు

'మహిళా సమాఖ్య పని తీరు భేష్'



మహిళా సమాఖ్య ప్రతినిధులతో మాట్లాడుతున్న అధికారులు

భిక్కనూరు: మండల మహిళా సమాఖ్య పనితీరు భేషుగ్గా ఉందని వివిధ రాష్ట్రాల అధికారులు పేర్కొన్నారు. ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, బీహార్, ఢిల్లీ, మణిపూర్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల అధికారులు శుక్రవారం భిక్కనూరు మండల మహిళా సమాఖ్యను సందర్శించారు. మహిళా సంఘాల పనితీరు, బ్యాంక్ లావాదేవీల గురించి తెలుసుకున్నారు. బస్వాపూర్, భిక్కనూరు మహిళా సంఘాల పనితీరు బాగుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీవో మురళీకృష్ణ,, డీపీఎం సుధాకర్, డీఎంజీ రాంచంద్రగౌడ్, ఏపీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్షమాభిక్షతో దక్కిన ప్రాణం..

- ఉరిశిక్ష నుంచి బయటపడిన మెండోరా వాసి
- 13 ఏళ్లు దుబాయ్ జైల్లో మగ్గిన మకూరి శంకర్
- చేయని నేరానికి శిక్ష అనుభవించిన వైనం
- దేగాం యాదాగౌడ్ చొరవతో ఇంటికి చేరుకున్న బాధితుడు



భార్య, కుమారుడితో శంకర్

ఇందూరు(నిజామాబాద్ అర్బన్): చేయని నేరానికి ఉరిశిక్ష ఖరారై దుబాయ్ జైల్లో శిక్ష అనుభవిస్తున్న నిజామాబాద్ జిల్లా వాసికి క్షమాభిక్షతో ప్రాణాలు దక్కాయి. ఆలూర్ మండలం దేగాం గ్రామానికి చెందిన దేగాం యాదాగౌడ్ చేసిన కృషితో 18 ఏళ్ల తర్వాత బాధితుడు క్షేమంగా స్వదేశానికి తిరిగొచ్చాడు. శుక్రవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బాధితుడితో కలిసి యాదాగౌడ్ విలేకరులతో మాట్లాడారు. వివరాల్లోకి వెళితే.. మెండోరా మండలానికి చెందిన మకూరి శంకర్ 2004లో దుబాయ్ వెళ్లాడు. అక్కడ పుజీర స్టేట్‌లో ఒక చిన్న కంపెనీలో ఫోర్‌మన్‌గా పని చేశాడు. అయితే రాజస్థాన్‌కు చెందిన రామావతార్ కుమావత్ పని చేస్తుండగా, ప్రమాదవశాత్తు ఆరంతస్తుల భవనం పైనుంచి పడి చనిపోయాడు. దీంతో ఫోర్‌మెన్‌గా ఉన్న శంకర్‌పై 2009లో హత్యానేరం మోపి దుబాయ్‌లోని పుజీరా జైలులో బంధించారు. కుమావత్‌ను తాను హత్య చేయలేదని, ప్రమాదవశాత్తు కిందపడి చనిపోయాడని అక్కడి కోర్టుకు ఎంత మొరపెట్టుకున్నా బలమైన సాక్ష్యాలు లేకపోవడంతో శంకర్‌కు 2013లో ఉరిశిక్ష ఖరారు చేసింది. అయితే, తన భర్త జైల్లో ఉన్నాడని తెలుసుకున్న శంకర్ భార్య భూదేవీ దేగాం యాదాగౌడ్‌ను ఆశ్రయించింది. యాదాగౌడ్ గతంలో విదేశాల్లో చిక్కుకున్న వారిని స్వదేశానికి రప్పించారు. తన భర్తను కూడా అలాగే దుబాయ్ జైలు నుంచి విడిపించాలని కోరింది.

కుమావత్ కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల ఆర్థిక సాయం...

భార్య పరిస్థితిని చూసి చలించిపోయిన దేగాం యాదాగౌడ్ ఉరిశిక్ష ఖరారై జైల్లో శిక్ష అనుభవిస్తున్న శంకర్‌ను స్వదేశానికి రప్పించడానికి ప్రయత్నాలు మొదలుపెట్టారు. దుబాయ్ చట్టాల ప్రకారం హత్య కేసులో ఉరిశిక్ష పడ్డ నిందితుడిని శిక్షనుంచి తప్పించాలంటే హత్యకు గురైన వ్యక్తి కుటుంబ సభ్యులు క్షమాభిక్ష లేఖ ఇవ్వాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో దుబాయ్‌లో లాయర్‌గా పని చేస్తున్న అనురాధ సహాయం తీసుకున్నారు. రాజస్థాన్‌లోని రామవతార్ కుమావత్ కుటుంబాన్ని వెతికి పట్టుకున్నారు. పలుమార్లు రాజస్థాన్‌కు వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడి క్షమాభిక్ష లేఖ ఇవ్వాలని కోరారు. ఇందుకు రూ.5లక్షల ఆర్థిక సాయం చేస్తామని ఒప్పందం కుదుర్చుకున్నారు. డబ్బుల కోసం శంకర్ భార్యతో పాటు యాదాగౌడ్ చందాలు సేకరించారు. రామవతార్ కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల డీడీని అందజేసి వారితో క్షమాభిక్ష లేఖను రాయించుకున్నారు. క్షమాభిక్ష లేఖను లాయర్ అనురాధ ద్వారా దుబాయ్‌లోని భారత ఎంబసీకి చేర్చారు. పేపర్లను పుజీరా జైలుకు అక్కడి నుంచి కోర్టుకు చేర్చడంతో శంకర్‌కు విధించిన ఉరిశిక్ష తప్పింది. శుక్రవారం స్వదేశానికి వచ్చిన శంకర్‌ను నేరుగా టీడీపీ కార్యాలయానికి తీసుకువచ్చారు. దేగాం యాదాగౌడ్ ప్రస్తుతం టీడీపీ జిల్లా అధ్యక్షులుగా పనని చేస్తున్నారు. ఉరిశిక్షను తప్పించడానికి యాదాగౌడ్ చేసిన మేలుకు బాధితుడు శంకర్‌తో పాటు అని భార్య భూదేవీ కన్నీరుపెట్టి కృతజ్ఞతలు తెలిపారు.

త్వరలో మాధవనగర్ రైల్వేగేట్ మూసివేత!



ఖలీల్‌వాడి: నిజామాబాద్ శివారులోని మాధవనగర్ ఆర్వోబీ పనుల నేపథ్యంలో త్వరలోనే ఈ దారిని మూసివేయనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఆ ప్రాంతంలో నోటీస్‌బోర్డు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో ఆర్వోబీ పిల్లర్స్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మాధవనగర్ రోడ్డుకు బదులుగా బైపాస్ రోడ్డును ప్రజలు వినియోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. హైదరాబాద్, డిచ్‌పల్లి ప్రాంతాలకు వెళ్లేవారు కంఠేశ్వర్ బైపాస్ ద్వారా వెళ్లాల్సి వస్తుంది. పనుల వేగాన్ని బట్టి త్వరలోనే గేటును మూసివేసే అవకాశాలున్నాయి. అందుకే ముందుస్తుగా నోటీస్ బోర్డు ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది.

బాల్య మిత్రుడి కడసారి చూపుకోసం..



హెలీకాప్టర్‌లో బాన్సువాడకు వచ్చిన స్పీకర్



స్నేహితుడి పాడె మోస్తున్న స్పీకర్ పోచారం

- హెలీకాప్టర్‌లో బాన్సువాడకు వచ్చిన స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ టౌన్: స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తన చిన్ననాటి స్నేహితుడు, జిల్లా వక్ఫ్‌బోర్డ్ మాజీ చైర్మన్ సాలంబిన్ అలీ అంత్యక్రియలకు శుక్రవారం హైదరాబాద్ నుంచి ప్రత్యేక హెలీకాప్టర్‌లో బాన్సువాడకు వచ్చారు. బడ్జెట్ సమావేశాల్లో ఉన్న స్పీకర్ తన బాల్య స్నేహితుడు మృతి చెందిన విషయం తెలియగానే చివరి చూపు కోసం వచ్చారు. వీక్లీ మార్కెట్‌లో హెలీప్యాడ్ దిగిన స్థలం నుంచి నేరుగా మండలంలోని రాంపూర్ గ్రామానికి వెళ్లారు. మజీద్ వద్ద ఉంచిన సాలంబిన్ అలీ మృతదేహాన్ని చూసి కన్నీరు పెట్టుకున్నారు. సాలంబిన్ కుటుంబ సభ్యులను ఓదార్చారు. సాలంబిన్ అలీ పాడె(జనాజా)ను మోశారు. ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసి నేక్ బీబీ సాహెబ్ శ్మశానవాటికలో ముస్లిం సంప్రదాయాల ప్రకారం ఖననం చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ మిత్రుడు సాలంబిన్ అలీ మరణం బాధాకరమన్నారు. స్పీకర్‌తో పాటు డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి పోచారం సురేందర్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదర్ రాజు తదితరులు సాలంబిన్ అలీ అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఖబ్రస్థాన్ స్థలాన్ని కాపాడాలి



నిజామాబాద్ సిటీ: నగరంలోని 13వ డివిజన్ ధర్మపురిహిల్స్‌లో గల ఖబ్రస్థాన్ స్థలాన్ని కాపాడి చుట్టూ కంచె నిర్మించాలని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. శుక్రవారం ఖబ్రస్థాన్ స్థలాన్ని కాంగ్రెస్ నాయకులు, ఖబ్రస్థాన్ కమిటీ సభ్యులతో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మపురి హిల్స్‌లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 3 ఎకరాల 20 గుంటల భూమిను శ్మశాన వాటికకు కేటాయించినట్లు చెప్పారు. ఖబ్రస్థాన్‌లో పెద్దపెద్ద గుంతలు ఉండటం చూసి ఇది గత మూడు నాలుగు నెలలుగా బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీ నాయకులు కలిసి చేసిన పని అని, ఇంత జరిగిన కబ్జా విషయం అధికారుల దృష్టికి పోకపోవటం దురదృష్టకరమన్నారు. చివరకు బీఆర్ఎస్, ఎంఐఎం నాయకులు బొందల గడ్డలను సైతం వదిలిపెట్టడం లేదన్నారు. కబ్జా వెనుకాల కార్పొరేటర్ ఒక్కరే లేరని దీని వెనుకాల చాలమంది ఉన్నారని వారిపై విచారణ జరిపించాలన్నారు. మైనార్టీ వర్గానికి చెందిన డిప్యూటీ మేయర్ ఇద్రిఖాస్ ఖబ్రస్థాన్ స్థలాన్ని కాపాడకపోవటం విచారకరమన్నారు. కేశ వేణు, గడుగు రోహిత్, రాజ నరేందర్‌గౌడ్, రత్నాకర్, ఖైసర్, ఏజాజ్ పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో చైన్ స్నాచింగ్

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధి మామిడిపల్లి వెంకటేశ్వర కాలనీలో శుక్రవారం ఓ మహిళ మెడలో నుంచి బంగారు గొలుసును దొంగలు లాక్కెళ్లారు. కాలనీకి చెందిన మాధవి రేషన్ బియ్యం కోసం స్కూటీపై బయటకు వెళ్లి వస్తున్న సమయంలో వెనుక నుంచి బైక్‌పై వచ్చిన దొంగలు రెండున్నర తులాల బంగారు గొలుసును లాగడంతో ఆమె కింద పడిపోయింది. లేచేసరికి మెడలో ఉన్న గొలుసును దొంగలు ఎత్తుకెళ్లినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఫిజియోథెరపి కేంద్రం తనిఖీ



ఆర్మూర్: తెలంగాణ సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో దివ్యాంగులకు అందిచే ఉచిత ఫిజియోథెరపి శిక్షణ సేవలను వైకల్యంతో బాధపడే పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఐఈ (ఇన్‌క్లూసివ్ ఎడ్యుకేషన్) కోఆర్డినేటర్ సింగం వనిత సూచించారు. పట్టణంలోని భవిత ప్రత్యేక అవసరాలు గల పిల్లల వనరుల కేంద్రంలో ఉచిత ఫిజియోథెరపి శిబిరాన్ని మండల విద్యాధికారి రాజగంగారాం శుక్రవారం ప్రారంభించారు. ఫిజియోథెరపీ వైద్యురాలు రేణుక శిబిరంలో శిక్షణ పొందిన చిన్నారుల తల్లిదండ్రులు వైద్యులు సూచించిన పద్ధతులను ఇంటి వద్ద ప్రాక్టీస్ చేయాలని సూచించారు. వైద్య శిబిరాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఐఈ కోఆర్డినేటర్ ఆర్మూర్ కేంద్రంలో దివ్యాంగులకు అందుతున్న సేవలను గురించి అడిగి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేసారు. ఇన్‌క్లూసివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్ కిషన్, సురేష్, ఆపరేటర్ శ్రీనివాస్, మెసెంజర్ రవి, సీజీవీ సైదా బేగం పాల్గొన్నారు.

బోరు బండిని ఢీకొన్న స్కూల్ బస్సు



డిచ్‌పల్లి: మండలంలోని బర్ధిపూర్–మాధవనగర్ బైపాస్ వద్ద శుక్రవారం సాయంత్రం జిల్లా కేంద్రానికి చెందిన ప్రైవేటు స్కూల్ బస్సు ప్రమాదవశాత్తు బోరుబండి వాహనాన్ని వెనుకనుంచి ఢీకొట్టింది. స్కూల్ ముగిసిన తర్వాత పిల్లలను తీసుకుని నిజామాబాద్ నుంచి డిచ్‌పల్లి వైపు బస్సు బయలుదేరింది. మాధవనగర్ గేటు దాటి బైపాస్ వద్దకు చేరగానే ముందు వెళుతున్న బోరుబండి వాహనం డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో దాని వెనకే వస్తున్న స్కూల్ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో స్కూల్ బస్సు ముందు అద్దాలు పగిలాయి. విద్యార్థులకు ఎలాంటి గాయాలు కాలేదు.

బంధాలు ప్రశ్నార్థకం!



- కావాల్సిన వారే కడతేరుస్తున్నారు
- ఏటా పెరుగుతున్న హత్య కేసులు
- డబ్బు, వివాహేతర బంధాలే ప్రధాన కారణాలు

కామారెడ్డి క్రైం: బంధాలు, బంధుత్వాలకు కాలం చెల్లుతోంది. స్నేహానికి కూడా విలువ లేకుండా పోయింది. ఆస్తులు, సొమ్ము కోసం ఎదుటి వారి ప్రాణాలు తీయడానికి సైతం వెనుకాడడం లేదు. వివాహేతర సంబంధాలు సైతం హత్యలకు ప్రధాన కారణంగా మారుతున్నాయి. జిల్లాలో ఇలాంటి ఘటనలు క్రమం తప్పకుండా వెలుగు చూస్తున్నాయి. హత్య కేసుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతూనే ఉంది. యేటా జిల్లాలోని ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో 35 నుంచి 40 హత్య కేసులు నమోదవుతున్నాయి. ఏ కేసు చూసినా వివాహేతర బంధాలు, డబ్బే కారణాలుగా కనిపిస్తున్నాయి. కామారెడ్డి జిల్లాలోని మూడు డివిజన్ల పరిధిలో 23 పోలీస్‌స్టేషన్‌లు ఉన్నాయి. ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఈ యేడాది ప్రారంభం నుంచి ఇప్పటికే ఐదు హత్య కేసులు నమోదయ్యాయి. నేరాల నియంత్రణకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నారు. అయినా హత్య నేరాలు పెరుగుతుండడం ఆందోళనకు గురిచేస్తోంది. ఎంతోమంది నేర ప్రవృత్తి వైపు మళ్లుతున్నారు. చిన్న చిన్న కారణాలకే ప్రాణాలు తీస్తున్నారు. తమ జీవితాలను సైతం జైలు పాలు చేసుకుంటున్నారు. దీంతో ఎన్నో కుటుంబాలు దిక్కుతోచని స్థితిలోకి వెళ్తున్నాయి. నేరాలను నియంత్రించడం కోసం గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి చట్టాలపై ప్రజలకు మరింత అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది.

ఇటీవల జరిగిన కొన్ని హత్యలు

ఒక మనిషి హత్యకు గురయ్యాడంటే అందుకు సొమ్ము, వివాహేతర బంధాలే ప్రధాన కారణాలుగా ఉంటాయి. జనవరి 12న బాన్సువాడలోని తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా జరుగుతున్న ఇంటి నిర్మాణాల వద్ద వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న పోచయ్య(50) హత్యకు గురయ్యాడు. ఇద్దరు దుండగులు ఇంటి నిర్మాణాల దగ్గర సలకను దోచుకునేందుకు రాగా అడ్డుకున్నందుకు అతన్ని హత్య చేశారని పోలీసుల విచారణలో వెల్లడైంది. 24న బాన్సువాడ మండలం తాడ్కోల్‌కు చెందిన తుమ్మల వెంకట్‌రెడ్డి (65) అతని భార్య రుక్మిణి చేతిలో హత్యకు గురయ్యాడు. కుటుంబ కలహాలు, ఆస్తి తగదాల నేపథ్యంలో వెంకట్‌రెడ్డిని అతని భార్య హత్య చేసింది. జనవరి 31న నస్రుల్లాబాద్ మండలం అంకోల్ గ్రామ శివారులో వివాహేతర బంధాల కారణంగా ఓ హత్య జరిగింది. గ్రామానికి చెందిన నీరడి శ్రీనివాస్(40)ను ఐదుగురు దారుణంగా హత్య చేశారు. శ్రీనివాస్ భార్యకు మరో వ్యక్తితో ఉన్న వివాహేతర సంబంధం మొదట గొడవలకు, ఆపై హత్యకు కారణమైనట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. తాజాగా ఎల్లారెడ్డి మున్సిపల్‌పరిధిలోని గండిమాసానిపేట్‌లో ఓ తల్లిని కొడుకు హత్య చేశాడు. వ్యవసాయ భూమిని విక్రయించడానికి ఒప్పుకోలేదని తల్లిని కొడుకు హతమార్చిన ఘటనే బంధాలు ప్రశ్నార్థకం అవుతున్నాయనడానికి నిదర్శనం. ఇదే కాకుండా రెండు రోజుల క్రితం నిజామాబాద్‌లో వెలుగు చూసిన హత్య కేసు కూడా ఇలాంటిదే. అనుమానంతో సవిత (38) అనే వివాహితను ఆమె భర్త మారుతి గొంతు నులిమి హత్య చేశాడు. ఇచ్చిన డబ్బును తిరిగి ఇవ్వాలని అడగడంతో స్నేహితుడిని నదిలోకి తోసేసి చంపిన ఘటన ఇటీవల నందిపేటలో వెలుగు చూసిన విషయం తెలిసిందే. జుక్కల్ మండలం హంగర్గ శివారులో గురువారం ఓ యువకుడు హత్యకు గురయ్యాడు. ఇలాంటి ఘటనలు అనేకం వెలుగు చూస్తున్నాయి.

కామారెడ్డి జిల్లాలో హత్య కేసుల వివరాలు..

సంవత్సరం	కేసులు
2019	28
2020	30
2021	46
2022	38
2023(ఇప్పటి వరకు)	5

అవగాహన కల్పిస్తున్నాం..



నేరాల నియంత్రణకు పోలీస్‌శాఖ తరఫున అన్ని చర్యలు తీసుకుంటున్నాం. నేరాలకు పాల్పడితే ఎంతటి వారైనా శిక్ష తప్పదు. చట్టాలపై అవగాహన ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలి. నేరాల నియంత్రణకు అవగాహన కార్యక్రమాలను కొనసాగిస్తున్నాం.

–శ్రీనివాస్‌రెడ్డి, ఎస్పీ, కామారెడ్డి

అఖిరి మజిలీకి అష్టకష్టాలు



బీబీపేట: ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి ప్రతిష్టాత్మకంగా నిర్మించిన వైకుంఠధామాలు పూర్తి చేయకపోవడంతో పేదలకు కష్టాలు తప్పడం లేదు. వైకుంఠధామలు ప్రారంభానికి నోచుకోకపోవడంతో చివరి మజిలీ నిర్వహించడానికి స్థలం లేనివారు అనేక ఇబ్బందులు పడుతున్నారు. బీబీపేటకు చెందిన సగ్గిల చంద్రం అనారోగ్యంతో చనిపోయాడు. వారి కుటుంబానికి ఉన్న ఒక గుంట స్థలంలో అంత్యక్రియలు నిర్వహించడానికి పూనుకున్నారు. చుట్టు పక్కల రైతులు నాట్లు వేయడంతో కనీసం దారి కూడా లేకుండా పోయింది. ఆ గుంట భూమిలో నాటు వేసి ఉండటంతో తొలగించి అంత్యక్రియలు పూర్తి చేశారు.

డాక్టర్‌తో రోగి బంధువుల గొడవ

ఖలీల్‌వాడి: నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రోగి బంధువులు, కుటుంబీకులు పీజీ స్టూడెంట్ డాక్టర్ మేఘనతో ట్రీట్‌మెంట్ విషయంలో గొడవ పడ్డట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. డాక్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

కంటి వెలుగు సిబ్బంది దురుసు ప్రవర్తన

నిజామాబాద్ సిటీ: నగరంలోని వినాయక్‌నగర్ న్యూహౌసింగ్‌బోర్డు కాలనీలో గల కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరంలో సిబ్బంది రోగులతో దురుసుగా ప్రవర్తిస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్న భోజనానికి వెళ్లిన సిబ్బంది సమయం మించి పోయిన రాకపోవడంతో పలువురు ప్రశ్నించగా అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఒకరు ఇష్టం వచ్చినట్లు మాట్లాడారు. సదరు సిబ్బంది ప్రవర్తన తీరుపై శిబిరం సూపర్‌వైజర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో దృష్టికి తీసుకెళ్లారు.

నేటి నుంచి టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు

నిజామాబాద్‌అర్బన్: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు శనివారం నుంచి నిర్వహించనున్నారు. ఈ నెల 14వ తేదీ వరకు పరీక్షలు ఉంటాయని డీఈవో దుర్గాప్రసాద్ తెలిపారు. నగరంలోని బాలికల పాఠశాలలో పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

14న ఉద్యోగమేళా

నిజామాబాద్‌నాగారం: జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కోసం జిల్లా ఉపాధి కార్యాలయంలో 14న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సిరిమల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ముత్తూట్ ఫైనాన్స్‌లో జూనియర్ రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్, ఇతర ఉద్యోగాలు ఉన్నాయని, విద్యార్హత డిగ్రీ/ ఎంబీఏ, ఎంకాం అన్నారు. 32 ఏళ్లలోపు వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు బయోడేటా, ఆధార్‌కార్డు, ఫొటోలు, సర్టిఫికెట్స్ తీసుకుని శివాజీనగర్‌లో గల ఉపాధి కార్యాలయంలో హాజరు కావాలన్నారు. వివరాలకు 9581768413, 9959456793 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో నిట్ విద్యార్థి మృతి

- బైక్ రేసే కారణామా



రుత్విక్ వర్ధన్ (ఫైల్)

హసన్‌పర్తి/లింగంపేట: హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం వంగపహాడ్ సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం పొల్కంపేటకు చెందిన మర్రి రుత్విక్(19) మృతి చెందాడు. రుత్విక్ వరంగల్ నిట్‌లో బీటెక్ తృతీయ సంవత్సరం(సీఎస్ఈ) చదువుతున్నాడు. గురువారం రాత్రి మిత్రులతో భోజనం చేశాక రెండు బైక్‌లపై హసన్‌పర్తి మండలం సిద్దాపురం వైపు బయల్దేరారు. వీరు భైరాన్‌పల్లి శివారు వరకు వెళ్లి తిరుగు ప్రయాణమయ్యారు. వంగపహాడ్ సమీపంలోని బాబాయి చెరువు మూల మలుపు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ఆటో అతివేగంగా వచ్చి స్రుపెన్ నడుపుతున్న బైక్‌ను ఢీకొంది. ప్రమాదంలో స్రుపెన్‌తో వెనుక కూర్చున్న రుత్విక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మరో బైక్‌పై ఉన్న స్నేహితులు గమనించి వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి శుక్రవారం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అప్పటికే రుత్విక్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బైక్ రేస్ పెట్టుకుని వేగంగా రావడం తోనే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలుపుతున్నారు. ఈ ఘటనలో మృతుడి తండ్రి మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

యువకుడి దారుణహత్య



నిజాంసాగర్: జుక్కల్ మండలం హంగర్గ శివారులోని పగుళ్ల గుట్ట ప్రాంతంలో మక్కల్ వాడి గంగాధర్ (27) దారుణహత్యకు గురయ్యాడు. జుక్కల్ ఎస్సై మురళి కథనం ప్రకారం.. మద్నూర్ మండలం అంతపూర్ గ్రామానికి చెందిన గంగాధర్ గురువారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాకపోగా పగుళ్ల గుట్ట వద్ద మృతదేహం ఉన్నట్లు తమకు సమాచారం వచ్చిందన్నారు. అక్కడి వెళ్లి చూడగా చిన్న నీటి కుంట వద్ద మృతదేహం ఉందన్నారు. గంగాధర్ తలపై మోదీ హత్య చేసినట్లుగా ఆనవాళ్లు ఉన్నాయన్నారు. మృతుడి భార్య రేణు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

రుద్రూర్: రుద్రూర్ మండల కేంద్రానికి చెందిన అయిటి రాజు (32) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రాజు బోధన్‌లోని ఓ క్లాత్ స్టోర్‌లో ఉద్యోగం చేసేవాడు. అయితే కొన్ని రోజులుగా విధులకు వెళ్లడం లేదు. ఇటీవల బైక్, సోదరుడి ఇల్లు కొనుగోలు చేశాడు. ఇందుకు అప్పులు చేశారు. ఆ అప్పులు తీర్చడానికి ఇబ్బంది పడుతున్నాడు. భార్య పుట్టింటికి వెళ్లగా గురువారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడినట్లు భార్య సౌమ్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే మృతుడి జేబులో బోధన్ క్లాత్ స్టోర్ వారు వేధించడంతోనే చనిపోతున్నట్లు రాసి ఉన్న సూసైడ్ నోట్ లభించింది. దీన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పంచనామా చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరు..

నస్రుల్లాబాద్: నస్రుల్లాబాద్‌కు చెందిన ద్యాగలి కిషన్(42) శుక్రవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై రంజిత్ రెడ్డి తెలిపిన వివరాలు.. కిషన్ మద్యానికి బానిసయ్యాడు. తరచూ భార్యతో గొడవ పడేవాడు. ఆమె ఇటీవల ఊరెళ్లింది. కాగా కిషన్ శుక్రవారం భార్యతో, చిన్న కూతురితో ఫోన్‌లో మాట్లాడాడు. ఊరెళ్లిన భార్యను ఇంకా రాలేదని గొడవ పడి మధ్యాహ్నం ఉరి వేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. కిషన్‌కు ఇద్దరు కూతుర్లు, ఒక కొడుకు ఉన్నారు.

రుద్రూర్‌లో బైక్ చోరీ

రుద్రూర్: రుద్రూర్‌లోని అంగడి బజార్ వద్ద బైక్ చోరీ అయింది. గ్రామానికి చెందిన శంకర్ గురువారం రాత్రి తన బండిని ఇంటి ముందు పెట్టి హ్యాండిల్ లాక్ వేసి పడుకున్నాడు. ఉదయం చూసే సరికి బైక్ కన్పించలేదు. ఐదు రోజుల క్రితం కందూర్‌గల్లిలో చంద్రశేఖర్ రెడ్డికి చెందిన ప్యాషన్ ప్రో బైక్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. వారం రోజుల క్రితం శ్రీ వీరభద్ర స్వామి ఆలయంలో హుండీ తాళం పగలగొట్టి అందులోకి డబ్బులు తస్కరించారు. పోలీసులు పెట్రోలింగ్ పెంచి దొంగతనాలు అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



గెలుపొందిన వారికి బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

నిజామాబాద్‌అర్బన్: జాతీయ గణాంక, పథకాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం గిరిరాజ్ కాలేజీ ఆడిటోరియంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. నిజామాబాద్ ప్రాంతానికి చెందిన వివిధ కళాశాలల నుంచి 40 బృందాలు పాల్గొన్నాయి. ముఖ్య అతిథిగా తెయూ స్టాటిస్టిక్స్ హెచ్‌వోడి కె సంపత్ కుమార్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ గణాంక శాఖ ప్రాముఖ్యతను వివరించారు. జాతీయ గణాంక శాఖ హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయం డిప్యూటీ డైరెక్టర్ శివ పార్వతిరెడ్డి మాట్లాడారు. రెండు దఫాలుగా నిర్వహించిన ఈ క్విజ్ పోటీల్లో నిశిత కామర్స్, సైన్సు కళాశాల విద్యార్థులు తబెల శ్రీనిత్య, నల్లగంటి అక్షిత ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. నిశిత డిగ్రీ కళాశాల విద్యార్థులు కొర్వ శ్రీకర్, గడ్డం లక్ష్మినరసింహారెడ్డి ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. గిరిరాజ్ కళాశాల విద్యార్థులు కీర్తి రచన, చిట్టిమెళ్ల సాయిలహరి తృతీయ బహుమతి గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ స్టాటిస్టిక్స్ అధికారి ప్రమోద్, గిరిరాజ్ కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

షర్మిలను కలిసిన బీఆర్ఎస్ సర్పంచ్



షర్మిలను కలిసిన సర్పంచ్ ప్రకాశ్

మద్నూర్: మండలంలోని తడి హిప్పర్గా సర్పంచ్ ప్రకాశ్ గాయక్‌వాడ్ శుక్రవారం వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను కలిశారు. చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు రావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు ఏళ్లుగా అభివృద్ధి పనుల బిల్లులు రాలేదని దీంతో సర్పంచ్‌లు బయట చెప్పుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామంలో రూ.30 లక్షలతో పలు అభివృద్ధి పనులు చేసినా నాలుగేళ్లుగా బిల్లులు రాలేదని దీంతో పార్టీని వీడే ఆలోచనతో ఉన్నానన్నారు. బీఆర్ఎస్‌ను వదిలి వైఎస్ఆర్‌టీపీలో చేరాలని అనుకుంటున్నానని త్వరలో పూర్తి విషయాలు తెలుపుతానన్నారు. వైఎస్ఆర్‌టీపీ కండువాను కప్పుకున్నారని సర్పంచ్‌ను ప్రశ్నించగా అది ఊరికే కప్పుకున్నానని చెప్పారు.

లభించని యువకుడి ఆచూకీ



చెరువులో గాలిస్తున్న ఈతగాళ్లు



గాలింపు చర్యలను పర్యవేక్షిస్తున్న అధికారులు

డిచ్‌పల్లి: మిట్టాపల్లి చెరువులో గురువారం మధ్యాహ్నం గల్లంతైన నల్లవెల్లి మహిపాల్ (34) ఆచూకీ 36 గంటలు గడిచినా లభించలేదు. దీంతో మహిపాల్ కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు. భార్య, తల్లితో కలిసి చెరువు వద్దకు వెళ్లిన మహిపాల్ స్నానం చేసేందుకు నీటిలో దిగి ఈతకొడుతూ గల్లంతైన విషయం తెలిసిందే. మహిపాల్ భార్య సుమలత ఫిర్యాదు మేరకు పోలీసులు గురువారం రాత్రి వరకు గాలించారు. చీకటి పడటంతో గాలింపు చర్యలు నిలిపివేశారు. తిరిగి అధికారులు, గ్రామస్తుల సహకారంతో శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు స్థానిక ఈతగాళ్లతో గాలించినా ఆచూకీ లభించలేదు. గాలింపు చర్యలను తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎస్సై గణేష్, ఆర్ఐ సంతోష్, సర్పంచ్ తేలు గణేష్, ఎంపీటీసీ గంగాధర్ పర్యవేక్షించారు. రాత్రి 7 గంటల వరకు గాలించినా ఫలితం లేకపోవడంతో గాలింపు చర్యలు నిలిపివేశారు. ఉన్నతాధికారుల సూచన మేరకు శనివారం ఉదయం గజ ఈతగాళ్లతో గాలింపు చేపడుతామని తహసీల్దార్, ఎస్సై తెలిపారు.

భార్య మృతికి కారణమైన భర్తకు జైలు

బోధన్: అనుమానంతో భార్యను వేధించి ఆమె మృతి కారణమైన భర్తకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ. వంద జరిమానా విధిస్తు శుక్రవారం బోధన్ అసిస్టెంట్ సెషన్ జడ్జీ దేవన్ అజయ్ కుమార్ తీర్పునిచ్చారు. జరిమానా కట్టకపోతే మరో నెల శిక్ష అనుభవించాలని పేర్కొన్నారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా బీర్కూర్ గ్రామానికి చెందిన మెంట చిన్న బాలయ్య తన కూతురు నీరడి జమునకు రుద్రూర్ మండలం రాణంపల్లి గ్రామానికి చెందిన నీరడి చిన్న సాయిలుకు తొమ్మిదేళ్ల క్రితం పెళ్లి జరిపించారు. వీరికి కొడుకు, కూతుర్లు ఉన్నారు. జమునను భర్త, అత్త గంగమణి వేధించేవారు. వారి వేధింపులు భరించలేక పిల్లలను వదిలేసి జమున పుట్టింటికి వెళ్లింది. 2021 ఆగస్టు 1న పెద్ద మనుషులు సర్ది చెప్పి భార్యాభర్తలు కలిసిమెలసి ఉండాలని సూచించారు. దీంతో జమునను నీరడి చిన్న సాయిలు వెంట తీసుకెళ్లాడు. మరుసటి రోజు ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని జమున మృతి చెందింది. వేధింపుల తోనే తన కూతురు చనిపోయిందని జమున తండ్రి రుద్రూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కోర్టులో విచారణనంతరం నిందితుడు నీరడి చిన్న సాయిలుకు జైలు శిక్ష విధిస్తు జడ్జి తీర్పు వెలువరించారు.

భార్యను చంపిన భర్త అరెస్టు



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

నిజామాబాద్ సిటీ: భార్యను చంపిన కేసులో భర్తను అరెస్టు చేసినట్లు నిజామాబాద్ రూరల్ సౌత్ సీఐ నరేష్ తెలిపారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో అరెస్టుకు సంబంధించి వివరాలు ఆయన వెల్లడించారు. నిజామాబాద్ రూరల్ మండలం భాగ్యనగర్(ఖానాపూర్)కు చెందిన గలాండే మారుతి గురువారం అతని భార్య సవితను అనుమానంతో హత్య చేశాడు. మారుతి తల్లి సక్కుబాయి సైతం సవితను తరుచుగా అదనపు కట్నం కోసం వేధించేది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు భర్త, అత్తలపై కేసు నమోదు చేసిన పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చారు.

బైక్‌ను ఢీకొన్న లారీ : మహిళ మృతి



ఎల్లవ్వ మృతదేహం

ఖలీల్‌వాడి: నగరంలోని నాగారాం బ్రహ్మంగారి ఆలయం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య మృతి చెందగా, భర్తకు గాయాలు అయ్యాయి. వివరాలు. కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండలం మీర్జాపూర్‌కు చెందిన రవి, ఎల్లవ్వ(35) దంపతులు శుక్రవారం వ్యక్తిగత పనుల నిమిత్తం నిజామాబాద్ బయలు దేరారు. వీరి టీవీఎస్ ఎక్సెల్‌ను బ్రహ్మంగారి గుడి వద్ద అతివేగంగా వస్తున్న లారీ ఢీకొంది. దీంతో దంపతులు ఇద్దరు గాయపడ్డారు. ఆస్పత్రికి తరలిస్తుండగా ఎల్లవ్వ చనిపోయింది. రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయినాథ్ తెలిపారు.

బైక్ అదుపు తప్పి ఒకరు..

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ శివారులో 63 నంబర్ జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏనుగు సాయన్న(42) మృతి చెందాడు. వివరాలు.. మిర్దాపల్లి గ్రామానికి చెందిన సాయన్న ఆర్మూర్‌లో పనులు ముగించుకొని తిరిగి వెళ్తున్నాడు. ఆర్మూర్ శివారులో బైక్‌కు అడ్డుగా పంది రావడంతో దానిని తప్పించే క్రమంలో వాహనం అదుపు తప్పి కిందపడటంతో తల తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సురేష్‌బాబు తెలిపారు.

డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు



మోపాల్: మండల కేంద్రంలో గురువారం రాత్రి, శుక్రవారం ఎస్సై మహేశ్ ఆధ్వర్యంలో డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడిపిన 15 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు. మద్యం తాగి వాహనాలు నడపవద్దని జీవితాలను బలిచేసుకోవద్దని సూచించారు. ఏఎస్సైలు రమేష్,సర్దార్‌సింగ్,కానిస్టేబుళ్లు ఉన్నారు.

డ్రంకన్ డ్రైవ్ కేసులో జైలు

కామారెడ్డి క్రైం: మద్యం తాగి వాహనం నడిపినందుకు ఓ వ్యక్తికి కామారెడ్డి కోర్టు రెండు రోజుల జైలు శిక్ష విధించింది. ఈ నెల 10న దేవునిపల్లి పోలీసులు వాహనాలు తనిఖీలు నిర్వహిస్తుండగా సదాశివనగర్ మండలం కల్వరాల్ గ్రామానికి చెందిన రాజు డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. అతడిని శుక్రవారం కోర్టుకు హాజరు పర్చగా ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి ప్రతాప్ జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.